క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డిలు రూ.1లక్ష విలువైన దుప్పట్లను పేద వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సంజీవరెడ్డి, స్వరూపారెడ్డి, మహేశ్, అనిల్, వెంకటేశ్‌గౌడ్, నర్సింహారెడ్డి, బాబు, గీతారెడ్డి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణ

బెజ్జంకి(సిద్దిపేట): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన పులి కృష్ణను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పులి కృష్ణను కవ్వంపెల్లి సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేర్యాల గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక మంగళవారం జరిగింది. ఎన్నికల అధికారి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా మంతపురి నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా రణం బాలయ్య, కార్యదర్శిగా తుంగ పరశురాములు, కోశాధికారిగా రణం కిష్టయ్య, డైరెక్టర్లుగా జంగం కిష్టయ్య, సుంకరి నర్సయ్య, సుంకరి రాజయ్య, గోనెపల్లి కనకయ్య, తుంగ పోచవ్వలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు మంగళవారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు రూ.29 వేల జరిమానా విధించారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ చైర్మన్‌గా రంగాచారి

సిద్దిపేటరూరల్: మండలంలోని పుల్లూర్ గ్రామంలో స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా కలకుంట్ల రంగాచారి నియామకమయ్యారు. మంగళవారం ఆలయ నూతన పాలకవర్గాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. 800 ఏళ్ల చరిత్ర కలిగిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఏళ్లుగా అర్చకులుగా కొనసాగుతూ, ఆలయ అభివృద్ధికి సేవలు అందిస్తున్న ఆలయ పూజారి కలకుంట్ల రంగాచారిని ఆలయ చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నూతన పాలక మండలికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, కుంచం బాలయ్య ఉన్నారు.

నియామకం

ములుగు(గజ్వేల్): ములుగు మండలం వంటిమామిడి కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ములుగుకు చెందిన మహ్మద్ జహంగీర్ మూడోసారి నియామకమయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. సీఎం కేసీఆర్ చిన్ననాటి మిత్రుడైన జహంగీర్ టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే చైర్మన్ పదవికి నియమితుడు కాగా 2020లో ప్రభుత్వం రెండోసారి జహంగీర్‌ను ఏఎంసీ చైర్మన్‌గా నియమించింది. పదవీ కాలం 2022 డిసెంబర్‌తో ముగియడంతో ప్రభుత్వం తాజాగా జహంగీర్‌ను మూడోసారి చైర్మన్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఏఎంసీ వైస్ చైర్మన్‌గా భూపాల్‌రెడ్డి, డైరెక్టర్లుగా రాందాస్‌గౌడ్, కృష్ణమూర్తి, బాలయ్య, బాపురెడ్డి, తిరుపతినాయక్, మహాలక్ష్మి, కుమార్‌యాదవ్, ప్రవీణ్‌చారి, రెడ్డి బాలమణి, సురేశ్, వీరన్నగారి చంద్రశేఖర్‌రెడ్డి, గణేశ్, చిన్నతిమ్మాపూర్ సర్పంచ్ హంస, వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడీఏలను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

ఉచిత వైద్య సేవలు అందించాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులకు అన్ని ఈహెచ్‌ఎస్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించాలని మండల ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పిట్ల శంకరయ్య అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి లింగోజి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు.

వైభవంగా శంభు బ్రహ్మోత్సవాలు



వెండి శఠగోప తాంబూలాన్ని అందజేస్తున్న దాత సబిత, రాఘవారెడ్డి దంపతులు



ఆలయం చుట్టూ బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో గల స్వయంభూ శంభు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు మంగళవారం పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, మండపారాధన, అంకురార్పణ, కలశ పూజ, స్వయంభుడు, పార్వతీ మాతకు విశేష పూజలు, మండపారాధన, రుద్రాభిషేకం, అన్నాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు దేవతామూర్తులకు ఒడిబియ్యం సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వేళలో ఆలయం చుట్టూ బండ్ల తిరుగుట(శకటోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ గొల్లపల్లి రాంచంద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు అత్యంత కనుల పండువగా సాగాయి. మూడురోజుల పాటు భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వహణ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

వెండి శఠగోపం అందజేత

గ్రామానికి చెందిన నర్ర సబిత–రాఘవారెడ్డి దంపతులు స్వామివారికి రూ.80 వేల విలువ చేసే వెండి శఠగోప తాంబూలాన్ని సమర్పించారు. ఇదివరకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో సుమారు రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందించారు. దీంతో వారికి ఆలయ చైర్మన్‌తో పాటు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీలు గురజాడ బాలాజీ, పిల్లి శిరీష, స్వయంభూ లింగేశ్వర సేవా సమితీ సభ్యులు మంచాల శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్, అనంతుల నరేందర్, పెద్ది కుమార్, శ్రీనివాస్, మంచాల చిన్న శ్రీనివాస్, దేశాయిరెడ్డి, మురళీధర్, వెంకటేశం, బూర్గుల వెంకటరమణ, కృష్ణమూర్తి, పబ్బ రాజయ్య, పెద్ది నర్సయ్య బ్రాహ్మణులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



మాట్లాడుతున్న రజిత

హుస్నాబాద్: వికసిత్ యువ, వికసిత్ భారత్ అనే నినాదంతో యువత లక్ష్యం వైపు ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. 26వ యూత్ ఫెస్టివల్‌ను పురస్కరించుకొని నెహ్రూ యువ కేంద్రం, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం 26వ జాతీయ యువజన వారోత్సవాలు నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. యువత మేలుకో గమ్యం చేరేవరకు విశ్రమించకుండా మహనీయుల బాటలో నడవాలని పిలుపునిచ్చారు. వజ్ర సంకల్పం గల యువత ఈ దేశానికి అవసరమని, ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వగురువుగా మార్చే స్థితి యువకులకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, కళాశాల ఇన్‌చార్జి దూలం రవీందర్, సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కర్ణాకర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి పల్లకీసేవ



పల్లకీ సేవలో భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని సీతారామాలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాములోరి పల్లకీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రధాన వీధుల గుండా భక్తులు ఊరేగించారు. స్వామివారి విగ్రహాలకు భక్తులు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాల ఊరేగింపులో భక్తులు భజన కీర్తనలు ఆలపిస్తూ తరించారు. అనంతనం గ్రామ శివారులోని పెద్ద చెరువులో రాములోరి విగ్రహాలతో తెప్ప చావ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రాజగోపాలాచారి, వరదాచార్యులు, పార్థసారధి, శ్రీనివాసచార్యులు, మధు, హరికృష్ణతో పాటు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి



ఇటిక్యాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గడా అధికారి ముత్యంరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గడా అధికారి ముత్యంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఈ నెల 19న ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయరాణి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి రజని, జగదేవ్‌పూర్ పీహెచ్‌సీ వైద్యుడు సత్యప్రకాశ్, సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతపై అవగాహన

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిన్నకోడూరు పీహెచ్‌సీ వైద్యురాలు సరిత అన్నారు. మంగళవారం చిన్నకోడూరుతో పాటు చంద్లాపూర్, మాచాపూర్ తదితర గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్ల అద్దాలను పంపిణీ చేస్తారన్నారు. కంటి వెలుగు ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని బంజేరుపల్లి గ్రామంలో కంటి వెలుగు పథకం శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీఓ శ్రీనివాస్, వైద్యాధికారి బాపురెడ్డి, సర్పంచ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కమిషనర్

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 12వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుబ్బాక మున్సిపల్ పరిధిలో రూ.4కోట్ల వ్యయంతో మురికి కాల్వలు నిర్మిస్తున్నామన్నారు. అలాగే 6.50 కోట్లతో పలు వార్డుల్లో సీసీరోడ్ల పనులు ప్రారంభించామన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ పృథ్వీరాజ్, సిబ్బంది ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

బెక్కల్ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని ప్రసిద్ధ బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు కానుకల ద్వారా రూ.1,49,510లు ఆదాయం సమకూరినట్లు రంగారావు తెలిపారు. అనంతరం కొబ్బరికాయలు, లడ్డు ప్రసాదాల వేలం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ ఈవో విశ్వనాథ్‌శర్మ, ఆలయ మాజీ చైర్మన్ తౌటి సంపత్, సర్పంచ్ కూకట్ల బాల్‌రాజు, ఏఎస్‌ఐ జగదీశ్వర్, ప్రధాన అర్చకులు శివప్ప తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి హుండీ ఆదాయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి మల్లికార్జునస్వామి ఉత్సవాల హుండీ ఆదాయం రూ.50వేలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సర్పంచ్ దేవసాని సుశీల, పంచాయతీ కార్యదర్శి పృథ్వీరాజ్‌ల సమక్షంలో హుండీని లెక్కించారు. హుండీ ఆదాయం రూ.20వేలు రాగా, దర్శన టికెట్ల ద్వారా రూ.30వేలు సమకూరినట్లు చెప్పారు. ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని అంతర్గత రోడ్ల అభివృద్ధికి రూ.22.87కోట్లు మంజూరయ్యాయని, మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, 17వవార్డు కౌన్సిలర్ లక్ష్మీకిషన్‌రెడ్డి, న్యాయవాది బాలముకుందరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గాప్రసాద్, ఉమర్, హైదర్‌పటేల్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడల నిర్వహణ అభినందనీయం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



క్రీడాకారులతో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గ్రామీణ స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణ అభినందనీయమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామంలో నీరుడి నర్సింలు స్మారకార్థం నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న ఎంతోమంది క్రీడాకారులకు తమను తాము నిరూపించుకోవడానికి ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీటీసీ జ్యోతిస్వామి, గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ స్వామి, నాయకులు స్వామిచారి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వేల్ ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. 33వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆర్‌బీఎల్(రాణే బ్రేక్ లైనింగ్స్ లిమిటెడ్) ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారముందన్నారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, ఆర్‌బీఎల్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బండ' జాతరకు ఏర్పాట్లు పూర్తి



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: పుల్లూరు బండపై వెలసిన స్వయంభూ లక్ష్మీనర్సింహ స్వామి జాతరకు పలు జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నూతన కమిటీ చైర్మన్, వంశపారంపర్య అర్చకులు రంగాచార్యులు, సర్పంచ్ పల్లె నరేశ్‌గౌడ్‌లు తెలిపారు. మంగళవారం ఆలయ పాలకవర్గం సభ్యులతో కలిసి ఈనెల 20 నుంచి 24 వరకు కొనసాగనున్న జాతర కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారని, మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఆలయం వద్ద అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో వంశపారంపర్య అర్చకులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు కలకుంట్ల నర్సింహాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ పాలకవర్గం సభ్యులు, వార్డుసభ్యులు రమేశ్, స్థానిక నాయకులు వెంకట్ పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పథకంతో గ్రామాభివృద్ధి

చిన్నకోడూరు(సిద్దిపేట): వాటర్ షెడ్ పథకం ద్వారా గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని వాటర్ షెడ్ జిల్లా అధికారి నూరోద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చౌడారం, అల్లీపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. వాటర్ షెడ్ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటర్ షెడ్ ద్వారా రాతి కట్టడాలు, నీటి గుంతలు, రైతులకు ఉపయోగపడే పనులతో పాటు గ్రామాభివృద్ధికి అవసరమయ్యే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెంద్యాల అనిత బాలయ్య, బండిపల్లి రాజాబాయి, వార్డుసభ్యులు, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొమురవెల్లి మండల సమావేశం




మాట్లాడుతున్న ఎంపీపీ కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తలారి కీర్తన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించడంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా అక్రమ లేఅవుట్ల హద్దురాళ్లను తొలగించాలని, మండలంలోని బెల్టుషాపులను మూసివేసేందుకు సభ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఎంపీపీ సభలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రావు, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఎంపీవో మంజుల, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ లాల్ భాగన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, త్వరలో ప్రవేశపెట్టనున్న అసెంబ్లీ బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ త్వరలో మంత్రి హరీశ్‌రావు ఇంటిని ముట్టడించనున్నట్లు ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు కొండ ప్రశాంత్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండ ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి శ్రద్ధ చూపడం లేదన్నారు. దేశంలో విద్యా వ్యవస్థపై అతి తక్కువ బడ్జెట్‌ని కేటాయించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడించనున్నట్లు, ఇందులో భాగంగా మంత్రి హరీశ్‌రావు ఇల్లు ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, సాయి, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతర సరిహద్దు వివాదాన్ని పరిష్కరించాలి



కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెళ్ల, తంగళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రతాపరుద్ర సింగాయ జాతర సరిహద్దు వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ.. తంగళ్లపల్లి గ్రామ సర్పంచ్ పాము నాగేశ్వరిశ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఈ నెల 21న జరిగే ప్రతాపరుద్ర లక్ష్మినరసింహ సింగరాయ జాతరకు రావాలని కోరారు. అలాగే రెండు గ్రామాల మధ్య ఉన్న జాతర సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం తంగళ్లపల్లి గ్రామంలో జాతర ఉత్సవ కమిటీని గ్రామస్తుల సమక్షంలో నియమించారు. 8 సంవత్సరాల నుంచి రెవెన్యూ అధికారుల సమక్షంలో జరిగిన జాతరను ఈ సంవత్సరం తంగళ్లపల్లి గ్రామం ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మానవత్వం చాటిన యువకులు



చిన్నారి తల్లికి నగదు అందిస్తున్న యువకులు

చేర్యాల(సిద్దిపేట): చిన్నారి గుండె ఆపరేషన్‌కు చేర్యాల పట్టణ యువకులు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని ఆకునూరుకు చెందిన మేకల రజనీరాజు దంపతుల కూతురు శాన్విశ్రీ(2) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఓపెన్ హార్ట్ ఆపరేషన్ చేయడానికి రూ.4లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగించే రాజు దంపతులు పాపకు ఆపరేషన్ చేయించే ఆర్థిక స్తోమత లేదని, ఎవరైనా సహాయం చేయాలని సోషల్ మీడియా వేదికగా కోరారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న చేర్యాల పట్టణ యువకులు తమ వంతుగా కొంత మొత్తాన్ని జమ చేయడంతో పాటు తమ వాట్సాప్ గ్రూపుల్లో విషయాన్ని పోస్ట్ చేసి డబ్బులు సేకరించారు. సేకరించిన రూ.81వేలను మంగళవారం పాప తల్లి రజనికి అందజేశారు. యువకులను పట్టణ ప్రజలతో పాటు ఆకునూరు గ్రామస్తులు అభినందించారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ వెంకట్రామిరెడ్డి

దుబ్బాక: రాయపోల్ మండలం మంతూర్ గ్రామ సమస్యలు పరిష్కరించడానికి నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉన్న నీటి, విద్యుత్ సమస్యల గురించి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి విన్నవించుకోగా సంబంధిత అధికారులకు ఎంపీ ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారన్నారు. అలాగే పద్మశాలీ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, బాల్‌రాజు ఉన్నారు.

పనికి తగిన వేతనం అందజేయాలి

సిద్దిపేటకమాన్: ఏఎన్‌ఎంలకు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని, బేసిక్ పే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. వైద్యారోగ్య శాఖలో రెండో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ కాశీనాథ్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు ప్రజలకు వైద్య సేవలు అందించడంతో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కంటివెలుగు కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలకు టీఏ, డీఏ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.